క్లుప్తంగా

కల్వర్టు నిర్మించండి



కాలువను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని ఆర్.అనంతపురం, తంగెళ్లపురం, విజయగోపాలపురం కలుజు నీరు వెళ్లే కాలువను ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వరవ కాలువలో మూడు చెరువుల నీరు వెళ్లడంతో పొలాలకు వెళ్లలేకపోతున్నామని తెలిపారు. కాలువపై కల్వర్టును నిర్మించాలని కోరారు. ఎంపీడీఓ త్రివిక్రమ్ రావు మాట్లాడుతూ.. కాలువపై కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యం, మాజీ ఎంపీటీసీ సభ్యులు మణి పాల్గొన్నారు.

కాప్రికార్న్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు

సత్యవేడు : మండలంలోని పాలగుంటలోని కాప్రికార్న్ జ్యూస్ ఫ్యాక్టరీలో తొలగించిన కార్మికులను పనిలోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ డిమాండు చేశారు. బుధవారం ఫ్యాక్టరీ ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టిన కార్మికులకు సీఐటీయూ నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కార్మికులు వినతులు ఇచ్చినా యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. 13 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నా కంపెనీ బాధ్యులు చొరవ చూపడం లేదన్నారు. యాజమాన్యం స్పందించకపోతే సీఐటీయూ, సీపీఎం ఇతర కార్మిక సంఘాలతో కలసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం



విద్యార్థినులకు నగదు అందజేస్తున్న శివయ్య

సత్యవేడు : మండలంలోని కాళమనాయుడుపేట గ్రామానికి చెందిన పేద విద్యార్థులు పెన్నెం యువశ్రీ, , ఉమ్మిటి హేమశ్రీ పదో తరగతి స్టడీ మెటీరియల్స్ కోసం సత్యవేడు చెందిన మన్నెం హేమావతి జ్ఞాపకార్థం మన్నెం శివయ్య ఒక్కో విద్యార్థికి రూ.2500 వంతున ఆర్థిక సాయం అందించారు. బుధవారం సత్యవేడులో జరిగిన దేవాంగ సంఘం సమావేశంలో అధ్యక్షుడు పొందు రంగయ్య సమక్షంలో విద్యార్థినులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో దేవాంగ సంఘం గౌరవ అధ్యక్షుడు మన్నెం శివయ్య, ప్రధాన కార్యదర్శి మురళీ కృష్ణ, కోశాధికారి రవిబాబు, ఉదయ్‌కుమార్, సజ్జ శివానందం , ఉమ్మిటి గుణశేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్నపత్రాలు



స్టేషన్ వద్ద ఉపాధ్యాయులకు ప్రశ్నపత్రాలు అందజేస్తున్న ఎంఈఓ రవి

సత్యవేడు : స్థానిక పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచిన 9వ తరగతి సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 సైన్సు ప్రశ్నపత్రాలను ఎంఈఓ రవి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. బుధవారం 9వ తరగతి చదువుతున్న 522 మంది విద్యార్థులకు బయోలాజికల్ సైన్సు పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చినబాబు, మునిమోహన్, చెంగల్రాయం, మణి పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పకడ్బందీగా సమ్మిట్-1 పరీక్షను నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ మునిసుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న సమ్మిట్-1 పరీక్ష రాస్తున్న విద్యార్థులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పరీక్షను పరిశీలిస్తున్న ఎంఈఓ

నకిలీల ఆటకట్టు



సత్యవేడులోని అగ్రి టెస్టింగ్ ల్యాబ్

భూసార పరీక్షలతో పాటు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించేందుకు సమీకృత వ్యవసాయ ప్రయోగశాల (ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్)కు మోక్షం లభించింది. వ్యవసాయ ఉత్పత్తుల్లో నాణ్యతను తనిఖీ చేసేందుకు కీలకంగా నిలిచే ఈ ల్యాబ్‌లను వైఎస్సార్ ప్రభుత్వంలో అంచనా విలువ రూ.70.60 లక్షలతో అన్ని వసతులతో భవనం నిర్మించారు. సత్యవేడులో గతేడాది జులైలో అగ్రి టెస్టింగ్ ల్యాబ్ భవనం ప్రారంభించారు. పరికరాలు ఏర్పాటు చేసే లోపు ఎన్నికలు రావడంతో జాప్యం నెలకొంది. దీంతో ఇప్పటి వరకు పరీక్షల నిర్వహణ పనులు చేపట్టలేదు. వారం రోజులుగా విత్తనాలు, ఎరువుల, పురుగు మందులు, వెటర్నటీ టెస్టింగ్ పరికరాలు ల్యాబ్‌కు చేరుతుండడంతో రైతులకు మంచి రోజులొచ్చాయని అంటున్నారు.

- అగ్రి ల్యాబ్ సేవలకు మోక్షం
- ప్రయోగ పరికరాలు మంజూరు
- సేవలు అందుబాటులోకి వచ్చేనా!

సత్యవేడు: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో నియోజకవర్గంలోని సత్యవేడులో రూ.70.60 లక్షల అంచనా వ్యయంతో సమీకృత వ్యవసాయ ప్రయోగశాల (ఇంటి గ్రేటెడ్ అగ్రి ల్యాబ్) ఏర్పాటైయింది. గతేడాది జులై చివరి వారంలో ల్యాబ్ భవనాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అప్పటి నుంచి నేటి వరకు పరికరాలు లేక భవనం అలంకారప్రాయంగా ఉండేది. గత వారంలో విత్తనాల విశ్లేషణ విభాగం, ఎరువులు, వెటర్నటీ విభాగాలకు అవసరమైన పరికరాలు అగ్రి ల్యాబ్‌కు చేరాయి.

పరికరాలు ఇలా..

విత్తనాల ల్యాబ్‌కు సంబంధించి సీడ్ డివైడర్, సీడ్ బ్లోయర్, మ్యాగ్నిఫియర్, ప్యూరిటీ వర్కు బోర్డు, జర్మినేటర్, డిజిటల్ మైక్రోస్కోప్. అలాగే ఎరువుల విశ్లేషణ విభాగంలో డిస్టిల్ వాటర్ యూనిట్, జల్‌డాల్ యూనిట్, పాక్యూమ్ డెసికేటర్, షేకర్, హెచ్‌పీ మీటర్, వాక్యూబ్ పంప్ వచ్చాయి.దీంతోపాటు వెటర్నటీ విభాగం రక్తం, పేడ పరీక్ష పరికరాలు, రక్త నమూల పరీక్ష కిట్లు, చర్మ వ్యాధులు గుర్తింపు పరికరాలు, తదితర కిట్లు అగ్రి ల్యాబ్‌కు చేరాయి.

ఖరీఫ్ సాగుకు మేలు

మండలంలో ఖరీఫ్ సాగుకు ఈ ల్యాబ్ అందుబాటులోకి వస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఎన్నికలకు ముందే ల్యాబ్ భవనం అందుబాటులో వచ్చింది. ఇప్పటికే పరికరాలు అగ్రి ల్యాబ్‌కు చేరాయి.

రైతులకు ఊరట

నియోజకవర్గంలోని సత్యవేడులో అగ్రి ల్యాబ్ అందుబాటులోకి వస్తే నాగలాపురం, పిచ్చాటూరు , నారాయణవనం, కేవీబీపురం, బుచ్చినాయుడు కండ్రిగ, వరదయ్యపాళెం , సత్యవేడు మండలాల్లోని రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఈ ల్యాబ్‌కు ఒక ఏఈ, ఏఈఓ ప్రస్తుతం అందుబాటులో ఉన్నారు. విత్తనాలు, ఎరువుల నాణ్యత, వెటర్నటీ పరీక్షలు ఇక్కడ చేయించుకునే వెసులుబాటు ఉంటుంది. వ్యవసాయాధికారి సిఫార్సు ద్వారా కేంద్రానికి వెళ్లి పరీక్షలు ఎటువంటి రుసుం చెల్లించకుండా పరీక్షలు చేయించుకోవచ్చు. ప్రైవేటు విత్తనాల డీలర్లు, ఎరువుల డీలర్లు పరీక్ష చేయించుకోవాలంటే రూ. 300 నుంచి 2,500 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ల్యాబ్ మొత్తాన్ని సబ్ డివిజన్ స్థాయిలో వ్యవసాయ సహాయ సంచాలకుల పర్యవేక్షణ విధులు నిర్వహిస్తున్నారు.

చౌకధరలతో మందులు

కూత వేటు దూరంలో ఉన్న తమిళనాడులో చౌక ధరలకే పురుగు మందులు లభిస్తాయి. తమిళనాడు ఆరంబాకంలోని ఒకే కంపెనీకి చెందిన మందులు లీటరు రూ. 500కు విక్రయిస్తుండగా వరదయ్యపాళెంలో అదే మందు రూ.1000 విక్రయిస్తున్నారు. అదే కాకుండా నకిలీ మందులు రైతులకు అంటగట్టి డీలర్లు దోపిడీ చేస్తున్నారు. అగ్రి ల్యాబ్ ప్రారంభంతో నకిలీ మందులు పరీక్షించుకొని నాణ్యమైన మందులు పంటకు పిచికారీ చేసి నష్టపోకుండా రైతుకు మేలు జరుగుతుంది.

– రవి, రైతు, వెంగారెడ్డి కండ్రిగ

కల్తీ విత్తనాల బెడద తప్పుతుంది

కల్తీ విత్తనాలతో రైతులు నార్లు పోసి నష్టపోతున్నారు. పంట దశలో ఎన్నురాక మోసపోతున్నారు. అగ్రి ల్యాబ్‌లో వితన పరీక్షలు చేయిస్తే ఏది నాణ్యత ఉందో తేలిపోతుంది. అప్పుడు రైతు విత్తనం వేయక ముందు జాగ్రత్త పడొచ్చు. త్వరితగతిన విత్తనాలు పరీక్షలు చేపట్టి రైతులకు మేలు చేకూర్చాలి.

– సుందరం, కేఎన్‌పేట, సత్యవేడు

కొత్త ఏడాదిలో ప్రారంభం



అగ్రి ల్యాబ్‌కు సంబంధించిన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. విద్యుత్ సౌకర్యం అందుబాటులో ఉంది. పరికరాలు, ఇతర యంత్రాలు వచ్చాయి. కొత్త ఏడాదిలో ప్రారంభించే అవకాశం ఉంది. ఈ ల్యాబ్‌తో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

– ద్వారకనాథ్ , అగ్రి ల్యాబ్ ఏఓ సత్యవేడు



ఎరువుల విశ్లేషణ పరికరాల గది



ల్యాబ్‌కు చేరిన ప్రయోగ పరికరాలు

కేబుల్ లైన్ పనుల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని 132 ఈహెచ్‌టీ అండర్ గ్రౌండ్ పవర్ కేబుల్ పనులు, 33 కేవీ అండర్ గ్రౌండ్ పవర్ కేబుల్ మూడు, ఎనిమిది అండర్ గ్రౌండ్ పవర్ కేబుల్ షిఫ్టింగ్ అంశాలపై బుధవారం క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, శ్రీకాళహస్తి ఆర్డీఓ భాను ప్రకాష్ రెడ్డి సంబంధిత విమానాశ్రయ, ఏపీ ట్రాన్స్‌కో , ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేసి ఆచరణాత్మక ప్రణాళికలతో పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీ ఎస్పీడీసీఎల్ ఈఈ చంద్రశేఖర్, ఏపీ ట్రాన్స్‌కో అధికారులు, రేణిగుంట తహశీల్దార్ సురేష్ బాబు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి డిపో డ్రైవర్‌కు అభినందన



బ్యాగ్‌ను ప్రయాణికుడికి అందిస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్ : శ్రీకాళహస్తి డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ జె.శ్రీనివాసులును అధికారులు అభినందించారు. బుధవారం తెలంగాణలోని కామారెడ్డికి చెందిన రామకృష్ణ అనే ప్రయాణికుడు శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి ఆర్టీసీ సర్వీసులో వచ్చారు. తన బ్యాగ్‌ను బస్సులోనే వదిలి పొరబాటున దిగేశాడు. అందులో ల్యాప్‌ట్యాప్‌తోపాటు పలు వస్తువులున్నాయి. తిరుపతిలో బ్యాగ్‌ను డ్రైవర్ శ్రీనివాసులు గుర్తించారు. వెంటనే జిల్లా ప్రజారవాణా అధికారి జగదీష్‌కు అప్పగించారు. మరోవైపు ప్రయాణికుడు తన బ్యాగ్ మిస్సింగ్ అయినట్లు ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు స్పందించి ప్రయాణికుడిని పిలిపించి బ్యాగ్ అందించారు. దీంతో రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాసులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, ఎన్ఎంయూ జిల్లా కార్యదర్శి బీఎస్ బాబు ఉన్నారు.

ఈవీఎం గోడౌన్‌కు పటిష్ట భద్రత అవసరం



ఈవీఎంల గోడౌన్ వద్ద జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

శ్రీకాళహస్తిరూరల్ (రేణిగుంట): తిరుపతి జిల్లాకు చెందిన ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్ వద్ద నిరంతరం పటిష్టమైన నిఘా, భద్రత ఉండాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా బుధవారం రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ గోడౌన్‌లో భద్ర పరిచిన ఈవీఎంలను రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను, అక్కడి భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల రోజున సక్రమంగా పని చేయని 66 ఈవీఎంలను బెల్ కంపెనీకి భద్రత నడుమ పంపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి, ఈవీఎం గోడౌన్ ఇన్‌చార్జ్, ఎస్డీసీ సుధారాణి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ప్రసాద్, రేణిగుంట తహసీల్దార్ సురేష్ బాబు, ఎలెక్షన్ సెల్ పవన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు మనోహరాచారి, చిరంజీవి, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ నిర్మాణాల నిర్లక్ష్యంపై ఆగ్రహం



పాతవీరాపురంలో సీసీ రోడ్డు పనులను తనిఖీ చేస్తున్న పీడీ

రేణిగుంట (ఏర్పేడు) : సిమెంట్ రోడ్డు నిర్మాణాల్లో నిర్లక్ష్యం వహించిన ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని, మొత్తం 35 పనులకు గాను రూ.1.70 కోట్ల పనులు మంజూరై రెండు నెలలు గడుస్తున్నా మండలంలో కేవలం 3 పనులకు రూ.3.65 లక్షలకు మాత్రమే పనులు చేయడంపై ఏఈ రవితేజ, ఏపీవో దేవరిపై డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏర్పేడు మండలం పాతవీరాపురంలో బుధవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను పీడీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. మండలంలో జరగాల్సిన 32 సిమెంట్ రోడ్డు నిర్మాణాలు ప్రారంభించకుండా ఉండటం బాధ్యతారాహిత్యమన్నారు. త్వరితగతిన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు పూర్తి చేసిన వారం రోజులల్లో మెటీరియల్ బిల్లులు వెంటనే మంజూరవుతున్నాయని వెంటనే సిమెంట్ రోడ్డు నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో డి.చంద్ర శేఖర్ రాజు, అవిలాల దేవరి, మండల ఇంజనీర్ రవితేజ, టెక్నికల్ అసిస్టెంట్ శాలిమనోహర్, జూనియర్ ఇంజినీర్ బాలాజీ రావ్ పాల్గొన్నారు.

అద్దె బస్సులకు స్వస్తి పలకాలి : ఎన్ఎంయూ



సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్ బాబు

శ్రీకాళహస్తి : ఆర్టీసీ అభివృద్ధి సాధించాలంటే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అద్దె బస్సులకు స్వస్తి చెప్పి నూతన బస్సులను ఏర్పాటు చేయాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ తిరుపతి జిల్లా కార్యదర్శి బీఎస్ బాబు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఎన్ఎంయూ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీఎస్ ఆర్టీసీలో ఓల్డ్ పెన్షన్ విధానం లేకపోవడంతో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారని తెలిపారు. పెన్షన్ విధానం లేని విలీనాన్ని తాము ఒప్పుకుని ఉండేవారం కాదన్నారు. ఆర్టీసీలో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి డిపో పరిధిలో పెద్ద సంఖ్యలో అద్దె బస్సులు నడుపుతున్నారని వెంటనే ఈ విధానానికి స్వస్తి పలికి బస్టాండులో మౌలిక వసతులు మెరుగుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చెంచులయ్య, జిల్లా అధ్యక్షుడు పెరుమాల్, ఉపాధ్యక్షుడు గుణశేఖర్, వైడీ కుమార్, మురళీ, జీఎస్ కుమార్, సాధిక్ పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



రైల్వే పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం

శ్రీకాళహస్తి రూరల్: (రేణిగుంట): రేణిగుంట- కడప రైల్వే మార్గంలోని మాముండూరు సమీపంలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి రైలు ప్రమాదంలో మృతి చెందినట్లు ఆర్పీఎఫ్ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. మృతుడు లైట్ బ్లూ కలర్ షర్ట్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్, ఆకుపచ్చ రంగు టవల్ ధరించి ఉన్నాడని, సుమారు 35 సంవత్సరాలు కలిగి ఉంటాయని ఎస్ఐ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు రేణిగుంట రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

సదస్సులో 11 వినతులు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రేణిగుంట మండలంలోని కృష్ణాపురం సచివాలయం వద్ద బుధవారం తహసీల్దార్ సురేష్ బాబు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మొత్తం 11 వినతులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. సదస్సులో సర్పంచ్ ముద్దురాయలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు వేయాలని వినతి

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని విజయగోపాలపురంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూములకు పట్టాలు, ఇంటి స్థలాలు, మ్యుటేషన్, సర్వే తదితర సమస్యలపై వినతులను తహసీల్దార్ సుబ్రమణ్యంకు అందజేశారు. వాటిని పరిశీలించి 30 రోజుల్లో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కేటీ రోడ్డు నుంచి గ్రామానికి వచ్చే రోడ్డు గుంతలమయమై అధ్వానంగా ఉన్నాయని మరమ్మతులు చేపట్టాలని కోరారు. గ్రామంలోని వీధులకు సిమెంట్ రోడ్లు వేయాలని విన్నవించారు. కార్యక్రమంలో ఆర్ఐ నల్లయ్య, వీఆర్ఓలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సమ్మేళనం



సమ్మేళనంలో రాజేంద్రుడు

శ్రీకాళహస్తి : కర్ణాటక రాష్ట్రం మైసూరు విశ్వవిద్యాలయంలో తెలుగు-కన్నడ సమ్మేళనం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల అధ్యాపకుడు సంక్రాంతి రాజేంద్రుడు హాజరయ్యారు. తనదైన శైలిలో మాట్లాడుతూ.. మంచి సూక్తులు విసురుతూ.. సామెతలతో సందర్భానికి అనుగుణంగా మాట్లాడుతూ.. ఆహుతులను ఆకర్షించారు. దీంతో ఆయనను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ నరసింహవర్మ, వైస్ ప్రిన్సిపల్ గంగారామ్ మాట్లాడుతూ.. కళాశాలకు రాజేంద్రుడు మంచి పేరు తీసుకొచ్చారన్నారు. ఆయనను అభినందించిన వారిలో అధ్యాపకులు పరంధామయ్య, మునెయ్య, సునీత, బాపనయ్య, సతీష్, రమేష్, సాయి, వెంకటేశ్వర్, రుద్రమదేవి, సుభాషిణి, వెంకటరమణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

శ్రీకాళహస్తి : అక్రమంగా తరలిస్తున్న 700 కిలోల రేషన్ బియ్యంతో పాటు ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు చెన్నై రోడ్డులోని సాయిబాబా ఆలయం సమీపంలో తరలించడానికి సిద్ధంగా ఉన్న 700 కిలోల రేషన్ బియ్యాన్ని పోలీసులకు అందిన రహస్య సమాచారంతో స్వాధీనం చేసుకున్నారు. ఆటోతో సహా సహదేవ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

రిటైర్డ్ ఎంపీడీఓ రామమ్మ మృతి



రామమ్మ (ఫైల్)

పుంగనూరు: అనారోగ్యంతో పుంగనూరు రిటైర్డ్ ఎంపీడీఓ రామమ్మ(65) బుధవారం మృతిచెందారు. ఈమె అంత్యక్రియలు నేడు స్వగ్రామమైన శ్రీకాళహస్తి సమీపం చుక్కలనిడిగల్లులో నిర్వహించనున్నారు. రామమ్మ గత 35 సంవత్సరాల క్రితం పుంగనూరులోనే ఉంటూ టైపిస్ట్‌గా విధుల్లో చేరి ఉద్యోగోన్నతిపై ఎంపీడీఓగా పనిచేసి, ఉద్యోగ విరమణ చేశారు. ఈమె మరణవార్త తెలియగానే ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు వెంకటరెడ్డి యాదవ్, నరసింహులు, మాజీ జెడ్పీటీసీ వేమన్న సహా పలువురు నేతలు ఆమె కుటుంబానికి సంతాపం తెలిపారు.

బాల్యవివాహాలతో అనర్థం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ లలితకుమారి

శ్రీకాళహస్తి రూరల్, (రేణిగుంట) : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం, సెంటర్ ఫర్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్టడీస్ సంయుక్తంగా రేణిగుంట మండలం వెంకటాపురం పంచాయతీ అన్నాస్వామి పల్లెలోని జడ్పీ హైస్కూల్‌లో బుధవారం బాల్యవివాహాల నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రొఫెసర్ లలిత కుమారి మాట్లాడుతూ.. బాల్య వివాహాల చేయడం వల్ల అనేక రకాలైన శారీరక , మానసిక, లైంగిక, సామాజిక ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. తద్వారా అనేక అవకాశాలను కోల్పోవడం బాలికలు చదువులో రాణించలేకపోవడంతో పాటు అనేక పర్యవసానాలు తమ జీవితంలో ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. బాల్యవివాహాలు దేశాభివృద్ధికి ఆటంకంగా పరిణమిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్రం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హైమావతి, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బంది, ప్రగతి ఎన్జీఓ మండల కోఆర్డినేటర్ జయలక్ష్మి, ప్రాజెక్ట్ అసిస్టెంట్ దివ్య సాయి పాల్గొన్నారు.

ప్రణాళికలతోనే సుస్థిరాభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

సత్యవేడు : పంచాయతీల్లో శాశ్వతమైన అభివృద్ధి లక్ష్యాల సాధనే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ కోరారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్‌లో భాగంగా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు, ఏఎన్ఎంలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం నిర్దేశించిన 9 అంశాలతో కూడిన లక్ష్యాలను అమలు చేయాలన్నారు. గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతులు తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్‌లు ఏఈ ఇబ్రహీం ఖాన్, ఈఓపీఆర్డీ తరునాక్షరెడ్డి, ఏఈ దేవిక, ఎంపీహెచ్‌ఈఓ సుబ్రహ్మణ్యం పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ రవి, సర్పంచులు , సెక్రటరీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ : పంచాయతీలలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కలసి ప్రణాళికలతోనే సుస్థిరాభివృద్ధి సాధించవచ్చునని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ పథకంపై సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ సమావేశం జరిగింది. నిరుపేదలందరూ సామాజిక, ఆర్థిక న్యాయం సాధించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాజశేఖర్, ఏపీఎం మునెయ్య, సీహెచ్ఓ వెంకటేశులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ